# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-05-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో యోగా సంస్కృతిని పెంపొందించేందుకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **ఎన్డీయే సమావేశంలో ఆపరేషన్ సిందూర్, కుల గణనపై ప్రధానంగా తీర్మానాలు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ వెల్లడించారు.**
3. **తెలంగాణలో ప్రైవేటు ఆసుపత్రులు, వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.**
4. **అన్నమయ్య డ్యాం నిర్మాణానికి వరద నీరును బట్టి అంచనాలు రూపొందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
5. **తెలంగాణ కాళేశ్వరంలోని త్రివేణీ సంగమంలో సరస్వతీనదీ పుష్కరాలు ఈరోజుతో ముగుస్తాయి.**

==========================

ఆంధ్రప్రదేశ్ లో యోగా సంస్కృతిని పెంపొందించేందుకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ప్రధానమంత్రి నరేంద్రనరేంద్రమోదీ పేర్కొన్నారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమయ్యే మన్ కీ బాత్ మనసులో మాట 122 వ సంచిక ద్వారా పలు అంశాలపై ప్రధానమంత్రి నిన్న ప్రసంగించారు. వచ్చే జూన్ 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ప్రజలు సంసిద్ధులవుతున్నారని తెలిపారు. విశాఖపట్నంలో జరిగే యోగా దినోత్సవంలో పాల్గొనడానికి తనకు అవకాశం లభించిందని అన్నారు. ఈసారి కూడా యువత.. దేశ వారసత్వంతో ముడిపడే ప్రదేశాల్లో యోగాసనాలు వేయబోతున్నారాని ప్రధాని తెలుపుతూ,

...వాయిస్.. 32 సెకన్లు

అలాగే తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా మహిళలు డ్రోన్లతో వ్యవసాయం చేయడాన్ని మన్ కీ బాత్ లో ప్రధానమంత్రి ప్రస్తావించారు. డ్రోన్ దిదీలు వ్యవసాయ రంగంలో మార్పునకు ప్రతీకలని చెప్పారు.సంగారెడ్డి మహిళలను ఇతర ప్రాంతాల మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

కాగా.. మన్ కీ బాత్ 122వ సంచికపై విశాఖపట్నం ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

మన్ కీ బాత్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యోగాంధ్ర-2025 గురించి ప్రస్తావించినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ లక్ష్యం కోసం ఐక్యంగా ఉన్నారని గుర్తు చేశారు. జూన్ 21 వరకు 100 పర్యాటక ప్రదేశాలతో సహా రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజులపాటు యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు జూన్ 21న విశాఖపట్నంలో నరేంద్ర మోదీకి స్వాగతం పలికేందుకు ఎదురు చూస్తున్నామని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

---------------------------

ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రధానంగా రెండు తీర్మానాలు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ వెల్లడించారు. పహల్గాం ఘటన అనంతరం భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత ఎన్డీయే పాలిత రాష్ట్రాలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌కి సంబంధించిన వివరాలను వారికి కేంద్రమంత్రులు వివరించారు. సమావేశం ముగిసిన అనంతరం పవన్ కళ్యాణ్ పాత్రికేయులతో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ విజయంపై ఒక తీర్మానం చేయగా.. దేశ వ్యాప్తంగా కేంద్రం చేపట్టబోయే కుల జనగణన నిర్ణయానికి మద్దతు పలుకుతూ మరో తీర్మానం చేశామని తెలుపుతూ,

వాయిస్.. 22 సెకన్లు

---------------------------

తెలంగాణలో ప్రైవేటు ఆసుపత్రులు, వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కరీంనగర్‌లో తెలంగాణ ఆసుపత్రులు, నర్సింగ్‌హోంల సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన 11వ రాష్ట్ర వార్షిక సదస్సు ముగింపు కార్యక్రమంలో మంత్రి గత సాయంత్రం పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి విధానపరమైన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని.. విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ప్రపంచంలో నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. నీతి ఆయోగ్ పాలక మండలి పదవ సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ స్థూల దేశీయోత్పత్తితో జపాన్ కంటే అధికంగా భారత ఆర్థిక వ్యవస్థ ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి – ఐఎంఎఫ్ అంచనా గణాంకాలను ఉదహరించారు.

---------------------------

తెలంగాణ కాళేశ్వరంలోని త్రివేణీ సంగమంలో సరస్వతీనదీ పుష్కరాలు ఈరోజుతో ముగుస్తాయి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన పుష్కరాలు 12 రోజులపాటు ఘనంగా జరిగాయి. పుష్కరాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటుగా మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు.

కాగా నిన్న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు పుష్కర స్నానం ఆచరించారు. పుణ్యస్నానం తర్వాత ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈరోజుతో పుష్కరాలు ముగుస్తున్న నేపథ్యంలో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులతో కాళేశ్వరం పరిసరాలు రద్దీగా మారాయి.

---------------------------

రాయలసీమలోని హంద్రీనీవా ప్రాజెక్టుకు బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలో టీడీపీ మండల, గ్రామ, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలతో మహానాడు ఏర్పాట్లపై ఆయన నిన్న సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, అన్నమయ్య డ్యామ్ నిర్మాణానికి వరద నీరును బట్టి అంచనాలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలయ్యే నాటికి హంద్రీనీవా ప్రాజెక్టు మొదటి దశ పనులు పూర్తి చేస్తామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..21 సెకన్లు

---------------------------

హైదరాబాద్‌లో ప్రపంచ సుందరి పోటీలు కొనసాగుతున్నాయి. మిస్‌వరల్డ్ 2025 పోటీల్లో భాగంగా హైటెక్స్‌లో ఈ రోజు సాయంత్రం 'బ్యూటీ విత్ ఎ పర్పస్' పోటీలు జరగనున్నాయి. పోటీదారులు తాము చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాల గురించి న్యాయ నిర్ణేతల ముందు వివరించనున్నారు. ఇందులో ఉత్తమంగా నిల్చిన వారు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంటారు. దీని తరువాత ఈ నెల 31న తుది పోటీలు జరుగుతాయి. ఇప్పటివరకు స్పోర్ట్స్ ఛాలెంజ్, టాలెంట్ ఛాలెంజ్, హెడ్ టు హెడ్ ఛాలెంజ్, టాప్ మోడల్ పోటీలు జరిగాయి.

---------------------------

నైరుతి రుతుపవనాలు పశ్చిమ మధ్య, తూర్పు మధ్య అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయని, అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు, రేపు, తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మి పేర్కొంటూ...

వాయిస్...28 సెకన్లు

తెలంగాణలోనూ రానున్న మూడు రోజులుకొన్ని జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పురపాలక శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. కడపలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, భవిష్యత్తులో

డంపింగ్ యార్డులు లేకుండా చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. దీనికోసం నెల్లూరు, కాకినాడల్లో ప్లాంట్ల నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, కడప, కర్నూలు, విజయవాడల్లో టెండర్లు పిలవాల్సి ఉందని వివరించారు. భవన నిర్మాణాలకు అనుమతులను సులభతరం చేయడానికి సాఫ్ట్‌వేర్ రూపొందించామన్నారు. రాష్ట్రంలో పురపాలక శాఖ పరిధిలో 2 వేల 342 కి.మీ. మురుగు కాల్వలు ఉండగా, 850 కి.మీ. మేర పూడికతీత పనులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు.

---------------------------

రేపటి నుంచి మూడు రోజుల పాటు కడపలో జరిగే తెలుగుదేశం పార్టీ మహానాడును ఘనంగా నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. కడపలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంత్రులు నారాయణ, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, రాంప్రసాద్ రెడ్డిలతో కలిసి మహానాడు ఏర్పాట్లపై నిన్న సమీక్ష నిర్వహించారు.

======================